# వేధిస్తున్న సిబ్బంది కొరత

- నార్నూర్ 30 పడకల ఆస్పత్రిలో ఖాళీగా పోస్టులు
- అత్యవసరంలో అందని వైద్యం
- ఇబ్బందుల్లో రోగులు



మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రి

**నార్నూర్:** రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లతో నార్నూర్‌లో 30 పడకల ఆస్పత్రిని నిర్మించింది. ఇది ప్రారంభించి మూడేళ్లవుతున్నా ఇప్పటికీ వైద్యులు, సిబ్బందిని నియమించలేదు. వైద్యసిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నా పోస్టులు భర్తీ చేయడంలో అధికారులు ఏమాత్రం దృష్టిసారించడం లేదు. అత్యవసర సమయంలో వైద్యం కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రారంభించి మూడేళ్లు..**

మూడేళ్ల క్రితం ఆస్పత్రిని అప్పటి కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు. నెల రోజుల్లో వైద్యులు, సిబ్బంది నియమాకానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి మరిచారు. ప్రాణప్రాయ స్థితిలో రోగులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. స్థానిక నాయకులు అధికారులపై ఒత్తిడి తేవడంతో దంతన్‌పల్లి పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబును డిప్యూటేషన్‌పై నియమించారు.

**పీహెచ్‌సీ సిబ్బందితోనే వైద్యసేవలు**

ఏజెన్సీ ప్రాంతంలోని నార్నూర్, గాదిగూడ మారుమూల మండలాలు. నార్నూర్ పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తూ 30 పడకల ఆస్పత్రిగా మార్చి మూడేళ్లవుతోంది. కాని ఇప్పటికి పీహెచ్‌సీ సిబ్బందితో వైద్యం అందిస్తున్నారు. ఒక స్టాఫ్‌నర్స్ తోపాటు ఒక వర్కర్ మాత్రమే రాత్రివేళ విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒక వైద్యుడు ఓపీ చూడడం, ఆస్పత్రి పనులు, సమావేశాల చూసుకోవడంతో సరిపోతుంది. స్థానికంగా వైద్యుడు ఉండకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది రోగులను పరిశీలించి ఉట్నూర్ లేదా ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు. ఇక్కడ 24 గంటలు ఆస్పత్రిలో వైద్యాధికారి ఒక్కరే ఉంటున్నారు.

**డిప్యూటేషన్‌పై ఒకరు మాత్రమే..**

30 పడకల ఆస్పత్రిలో మొత్తం ఆరుగురు వైద్యులు ఉండాలి. డిప్యూటేషన్‌పై ఒకరు, 18 స్టాఫ్‌నర్స్‌లకు నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకరు, సాయత్రం 6 నుంచి ఉదయం 9 గంటలకు మరొకరు విధుల్లో ఉంటున్నారు. అధిక పనిభారంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ముగ్గురు ల్యాబ్‌టెక్నీషియన్లకు ఒకరే ఉన్నారు. పీహెచ్‌సీ నుంచి ల్యాబ్‌టెక్నీషియన్ ఒకరు వారానికి రెండు రోజులు వస్తున్నారు. ఇద్దరు ఫార్మసిస్ట్‌లకు ఒక్కరే విధుల్లో ఉన్నారు. ముగ్గురు ఎక్స్‌రే టెక్నికల్ సిబ్బందికి ఒక్కరు లేరు.

**ఆస్పత్రిలో ఖాళీల వివరాలు..**

| పోస్టులు | మొత్తం | పనిచేస్తున్నవారు | ఖాళీలు |
|---|---|---|---|
| వైద్యులు | 06 | 00 | 06 |
| స్టాఫ్‌నర్స్ | 18 | 04 | 14 |
| ఫార్మాసిస్టులు | 02 | 01 | 01 |
| ల్యాబ్‌టెక్నీషియన్ | 03 | 00 | 02 |
| ఎక్సరే టెక్నికల్ | 03 | 00 | 00 |

**నివేదించాం**

నార్నూర్ 30 పడకల ఆస్పత్రిలో ఖాళీల వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవం. ఎన్నికల తర్వాత మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– డాక్టర్ ఉపేందర్, సూపరింటెండెంట్, ఉట్నూర్

## క్లుప్తంగా

### సామాజిక బాధ్యతతో విద్యాబుద్ధులు చెప్పాలి

**ఆదిలాబాద్‌టౌన్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులకు చదువు చెప్పేందుకు సామాజిక బాధ్యతతో కళాశాల విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల జలగం ప్రిన్సిపాల్ అనిత అన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో చదివే 'పిల్లల కోసం తొలిమెట్టు' అనే కార్యక్రమానికి ఎంపికైన వలంటీర్లకు శుక్రవారం పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్ రావు, ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు టి.స్వప్న, మహమ్మద్ యాకూబ్ అలీ, లెక్చరర్లు నందిని, గోపాల్ పాల్గొన్నారు.

### చిన్నారులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

**ఎదులాపురం:** పట్టణంలోని సుందరయ్య అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 0–6 సంవత్సరాల వరకు 60 మందికి పిల్లలకు ఆర్‌బీఎస్‌కే వైద్యుడు నరేందర్, సుజాత, సువర్ణ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 8 మందిని ఎన్‌ఆర్‌సీకి రిఫర్ చేశారు. ఏడబ్ల్యూటీ రాధ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### విజయవంతం చేయండి

**బజార్‌హత్నూర్:** ఇచ్చోడ అభినందన్ కన్వెన్సన్ హాల్‌లో ఈనెల 19న నిర్వహించే క్రాంతివీర్ లహుజీ రాగోజీ సాల్వే జయంతిని విజయవంతం చేయాలని మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు గడకరే పరుశురాం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మాంగ్ సమాజ్ ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

### కేటీఆర్‌కు మెమోంటో బహూకరణ

**ఉట్నూర్‌రూరల్:** బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ మంత్రి కేటీఆర్ జన్నారంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు వచ్చిన సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ కేటీఆర్ చిత్రపటంతో కూడిన మెమోంటోను అందించారు. అసెంబ్లీ ఎన్నికల్లో జాన్సన్ నాయక్ భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలని సూచించారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఆదిలాబాద్‌రూరల్:** 33/11 కేవీ ఉప కేంద్రం జీఎస్‌నగర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాంపూర్, పొచ్చర, దిమ్మ, జందాపూర్, భీంసరి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## 'ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, సభ్యులు

**ఇంద్రవెల్లి:** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 7నుంచి కొనసాగుతున్న 'ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న' అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ముత్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంఈవో నారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతోందన్నారు. బాల విజ్ఞాన మేళా, సైన్స్ జాతర, సైన్స్ ప్రదర్శనలు, కళాజాత, పుస్తక ప్రదర్శన చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అశోక్, రాంమోహన్, మనోజ్‌కుమార్, రిసోర్స్ పర్సన్ బలిరాం, అనిత, నత్తుల రవీందర్, మెస్రం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బోథ్:** మండలంలోని రైతువేదికలో శుక్రవారం 'ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. జాతీయ శాస్త్రీయ దృక్పథం ప్రచారంలో భాగంగా జిల్లాలో బాల విజ్ఞాన మేళా, సైన్స్ జాతర, సైన్స్ ప్రదర్శనలు, కళాజాత, పుస్తక ప్రదర్శనలు ఈనెల 7నుంచి 28 వరకు నిర్వహించడం జరుగుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రదాన కార్యదర్శి నూతల రవీందర్ తెలిపారు. ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ప్రధానోపాధ్యాలు పోశెట్టి, నరేశ్‌కుమార్, శశిధర్, సచిన్, హన్మండ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి



కవాతులో పాల్గొన్న పోలీసులు

**ఇంద్రవెల్లి:** అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఉట్నూర్ సీఐ రామక్రిష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని దనోరా, ముత్నూర్ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎలాంటి గొడవలు జరగకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి ఎస్సై దుబ్బాక సునీల్, బీఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆదిలాబాద్‌రూరల్:** ఈనెల 30న జరగనున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావ్ కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చర, దిమ్మ, చించుఘాట్, మాలేబోరిగాం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై ముజాహిద్, సిబ్బంది ఉన్నారు.

## 'నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్‌ఎస్'




మాట్లాడుతున్న ఆరే రాజు

**ఎదులాపురం:** 1200 మంది విద్యార్థుల ఆత్మబలిదానాల ఫలితంగా స్వరాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని నిరుద్యోగ జేఏసీ ఆదిలాబాద్ అధ్యక్షుడు ఆరే రాజు ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సీఎం కేసీఆర్ వేల కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన 80,000 ఉద్యోగాల కేవలం నోటిఫికేషన్‌లకే పరిమితం అయ్యాయన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం నిరుద్యోగ జేఏసీని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా సర్వేశ్, కార్యదర్శిగా రాకేశ్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కన్వీనర్‌లుగా గజానంద్, రాకేశ్, సంధ్య, శైలజలను ఎన్నుకున్నారు.

## 'రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ'



మాట్లాడుతున్న నాయకులు

**ఆదిలాబాద్‌రూరల్:** రాజకీయ లబ్ధి కోసమే ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతున్నాడని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నూతన అంబేద్కర్ భవనంలో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఈనెల 11న నిర్వహించిన మాదిగల విశ్వరూప మహాసభలో ప్రధాని మోదీ పాల్గొని ఎస్సీ వర్గీకరణ చేసేందుకు సిద్ధంగా ఉన్నామనడం తగదన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జేఏసీ ఏర్పాటు చేసే ఉద్దేశంతో ఈనెల 19న నూతన అంబేద్కర్ భవనంలో సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయి జేఏసీని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న, నాయకులు రాజారెడ్డి, నారాయణ, శోభబాయి తుల్జాపూరే, వర ప్రసాద్, రమేష్, శ్రీనివాస్, కాంతారావ్, సులోచన పాల్గొన్నారు.

### పోలీసులకు సహకరించాలి

**ఇంద్రవెల్లి:** త్వరలో నిర్వహించే ఎన్నికల్లో గ్రా మీణ యువత పోలీసులకు సహకరించాలని ఇంద్రవెల్లి ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని తుమ్మగూడ, సమాక, ఏమాయికుంట పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అయా గ్రామాల్లోని యువతతో మాట్లాడారు. గ్రామీణ యువత ఎన్నికలు నిర్వహణ విషయంలో పోలీసుశాఖకు, అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై లక్ష్మణ్, పోలీసు కానిస్టేబుల్, తదితరులు పాల్గొన్నారు.

### క్షీరాభిషేకం

**నేరడిగొండ:** ఇటీవల హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నిర్వహించిన విశ్వరూప మహాసభలో ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ ఏర్పాటుకు కమిటీ నియమిస్తామని ప్రకటించిన సందర్భగా శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శీతకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మోతే బారక్ రావు, రాజన్న, ఇస్తారి, అశోక్, సుద్దాల శివకుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలే ప్రజలకు భరోసా

- ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న



యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



లాండసాంగ్వీలో బట్టలు ఐరన్ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

**ఆదిలాబాద్‌రూరల్:** సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలకు భరోసా అని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వివరిస్తూ కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్నిరంగాల్లో గణనీయమైనా పురోగతి సాధించామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిఇంటికీ చేరాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గండ్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ జంగు, ఆత్మ చైర్మన్ జిట్టా రమేశ్, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేశ్, నాయకులు అంకత్ శ్రీనివాస్, రాంసం వినోద్, షేక్ ఆరీఫ్, కనక రమణ పాల్గొన్నారు.

**ప్రజల సుభిక్షం కోసమే రాజశ్యామల యాగం**

**ఆదిలాబాద్‌టౌన్:** జిల్లా వాసులు సుభిక్షంగా ఉండాలని రాజశ్యామల యాగం చేసినట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో వేదపండితులు దుబే సాయికృష్ణ, ఉప్పల సంతోష్, వైభవ్ శర్మల మంత్రోచ్ఛరణల మధ్య యాగం నిర్వహించారు. ఆయన సతీమణి జోగు రమతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

## గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- బోథ్ బీజేపీ అభ్యర్థి 'సోయం'



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావ్



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

**బజార్‌హత్నూర్:** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన సాధ్యమైందని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుతో గ్రామాల్లో మరింత అభివృద్ధి జరుగుతుందని బోథ్ బీజేపీ అభ్యర్థి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అనంతపూర్, హర్కాయి, టెంబి, మంజరంతండా, దేగామ, దరంపురి, చింతలసాంంగ్వీ, మాడగూడ, గోకొండ, ఉప్పర్‌పల్లి గ్రామాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ ఇంజన్ సర్కారు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్, ఎంపీపీ అజడే జయశ్రీ, కేవల్‌సింగ్, మండల అధ్యక్షుడు బత్తిని సుధాకర్ యాదవ్, ఎంపీటీసీలు సోన్‌టాకే గజానంద్, చందు, విజయసుంగన్న, సర్పంచ్‌లు మడవి ప్రకాష్, ఆనందరావ్, నగేశ్, యాదవ్‌రావ్, పెరుగు సంతోష్, లింగన్న, రాజు పాల్గొన్నారు.

**బీజేపీ జెండా ఎగరడం ఖాయం**

**బోథ్:** ఈఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మండల కన్వీనర్ సుభాష్ సూర్య అన్నారు. శుక్రవారం సొనాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అహంకారపు ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో రామాయి సదానందం, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## 'బహుజనులను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ'



కడెం: సభకు వెళ్తున్న గ్రామస్తులు



ఇంద్రవెల్లి: తరలివెళ్తున్న నాయకులు

**ఖానాపూర్:** బహుజనులను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి సర్సాగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. సమావేశంలో భాస్కర్, రాజేందర్, మురళి, శ్రీనివాస్, కిశోర్, సురేశ్, సత్యనారాయణ, సంతోశ్, గంగాధర్, రాజన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

**కేటీఆర్ సభకు తరలిన శ్రేణులు**

**ఖానాపూర్:** జన్నారంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి వాహనాల్లో వెళ్లారు.

**కడెం:** జన్నారంలో శుక్రవారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు కలిసి ప్రత్యేక వాహనాల్లో జన్నారం వెళ్లారు.

**ఇంద్రవెల్లి:** జన్నారంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు మండల కేంద్రం నుంచి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారుతి డోంగ్రె ఆధ్వర్యంలో నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో జెడ్పి కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు సుఫీయన్, కోవ రాజేశ్వర్, రాథోడ్ మోహన్‌నాయక్, మీర్జా జీలానిబేగ్, జాదవ్ లఖన్ ఉన్నారు.

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వెంకట్ రెడ్డి

**తాంసి:** కాంగ్రెస్ మండల తాత్కాలిక అధ్యక్షుడిగా చిల్కూరి వెంకట్ రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం మండల అధ్యక్షుడిగా ఉన్న కొడాల సంతోష్ వ్యక్తిగత కారణాలతో పార్టీకి దూరంగా ఉంటున్నాడు. కాగా.. మండల ఉపాధ్యక్షుడిగా ఉన్న వెంకట్ రెడ్డికి బాధ్యతలు అప్పజేప్పినట్లు కొడాల సంతోష్ శుక్రవారం తెలిపారు.

### ఎంఐఎంకు రషీద్ రాజీనామా

**ఎదులాపురం:** ఎంఐఎం ఆదిలాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శి సయ్యద్ షా రషీద్ ఉల్ హక్ రాజీనామా చేసినట్లు ప్రకటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. పార్టీలోని కొందరి వైఖరి నచ్చక తనతో పాటు పలు వార్డులకు చెందిన అధ్యక్షులు రాజీనామా చేయడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా, బీఆర్‌ఎస్‌కు తొత్తుగా కొందరు పని చేస్తున్నారని ఆరోపించారు.

### కరంజి(టి)లో డెంగీ కేసు

**తాంసి:** భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామంలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన మహిళకు డెంగీ జ్వరం సోకడంతో భీంపూర్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిఖిల్‌రాజ్ ఆదేశాల మేరకు హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్ వైద్యసిబ్బందితో గ్రామాన్ని సందర్శించారు. మహిళకు అందుతున్న చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి చుట్టు రసాయన మందు పిచికారీతో పాటు క్లోరినేషన్ పనులు చేయించారు. వారి వెంట సూపర్‌వైజర్ గంగాధర్, వివేక్, ఆరోగ్య కార్యకర్త సుజాత, పంచాయతీ కార్యదర్శి నితిన్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

### నిర్భయంగా ఓటు వేయాలి



ఓటర్ స్లిప్పులు అందజేస్తున్న తహసీల్దార్

**తాంసి:** రానున్న ఎన్నికల్లో ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా ఓటు వేయాలని తహసీల్దార్ లక్ష్మీ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఓటింగ్ ప్రక్రియపై ఓటర్లకు సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఓటర్లకు సీ-విజిల్ యాప్ వినియోగం, ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానాన్ని వివరించారు. అనంతరం బీఎల్‌వోలతో కలిసి ఓటర్ స్లిప్పులను ఇంటింటా పంపిణీ చేశారు. ఈనెల 20తేదీ లోపు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలని ఆదేశించారు. వారి వెంట ఆర్ఐ మహేందర్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, బాపురావు, బీఎల్‌వోలు విజయలక్ష్మీ, భాగీర్థ ఉన్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



ప్రచారం చేస్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

**బోథ్:** గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ రమేశ్, రమేశ్, ఎంపీటీసీ అల్లకొండ ప్రశాంత్, జుగాదిరావ్, విజయ్ పాల్గొన్నారు. అలాగే చింతల్‌బోరి గ్రామానికి చెందిన రాందాస్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇటీవల బీజేపీలో చేరిన ఆయన తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్, పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, జుగాదిరావ్, ఇష్తకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యం




మాట్లాడుతున్న ఎల్లల దత్తాత్రేయ

**ఎదులాపురం:** నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు జేఏసీ అధ్యక్షుడు ఎల్ల్లల దత్తాత్రేయ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్నకు మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. జిల్లాలో ఐటీ పరిశ్రమ నెలకొల్పి యువతకు అవకాశం కల్పించడంతో పాటు ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకలు శ్రీనివాసచారి, పాండు జాదవ్, మల్లెల స్వామి, వంశీకృష్ణ, సత్యపాల్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాలు పరిశీలన

**లోకేశ్వరం:** ప్రలోభాలకు లొంగకుండా, గొడవలకు దిగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బిలోలి, సాథ్‌గాం, కిష్టాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధిగా ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్ తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వేదపీ వివరణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899